క్లుప్తంగా

25న జనచైతన్యయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద వ్యతిరేక విధానాలకు నిరసనగా చే పట్టిన జన చైతన్య బస్సు యాత్ర ఈ నెల 25న మంచిర్యాల జిల్లాలో ప్రవేశిస్తుందని సీపీఎం నాయకులు తెలిపారు. బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయం ఆవరణలో బుధవారం యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 23న జనచైతన్య యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నిర్ధేశించిన ప్రాంతాల్లో పర్యటించి 25న మంచిర్యాల జిల్లా శివారు తాండూర్ మండలంలో అడుగుపెడుతుందని వివరించారు. జనచైతన్య యాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎం నాయకులు ఎ.రమణ, జి.అశోక్, దేవదాసు, మల్లేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కాసిపేట: దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో గురువారం నిర్వహించే కాగడాల ప్రదర్శనను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. సోమగూడెంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ కార్యదర్శి రేకుంట చంద్రశేఖర్ హాజరవుతారని ప్రజలు, విద్యార్థులు, మేధావులు, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, యూనియన్ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జాడి పోశం, దాడి గట్టయ్య, గట్టు సర్వేశం, పులి శంకర్, బండారి సత్తయ్య తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ సార్వభౌమత్వం కోసం బ్రిటిష సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరు చేసి, అమరవీరులను స్మరిస్తూ నిర్వహించే వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, పట్టణ కార్యదర్శి రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి స్థానికులు బుధవారం ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన బుదారపు కళ-రాములు ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులతో సతమతమవతూ కేవలం రెండు రేకులతో వేసుకున్న గూడులో జీవనం సాగిస్తోంది. వీరిని మానవతా దృక్పథంతో ఆదుకునేలా స్థానిక గ్రామ పెద్ద గోనె సతీశ్‌రావు రూ.20వేల నగదు, స్థానిక సర్పంచ్ మంచాల శ్రీనివాస్ రూ.15వేల విలువ గల ఇటుక, ఎంపీటీసీ గడ్డం శ్రీలత రూ.5వేల నగదుతో మొత్తంగా రూ.40వేల విలువ గల ఆర్థిక సాయాన్ని అందించారు. వీరి కష్టాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి మరింత సాయం అందేలా చూస్తామని సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు గ్రామానికి చెందిన బ్రహనిత కొద్ది రోజుల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతుందని పాడేటి వెంకాగౌడ్ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ సతీష్‌గౌడ్ రూ.10వేల బాధితురాలికి ఆర్థికసాయం అందజేశారు.

సాక్షి సినిమాలు

మంచిర్యాల

శ్రీనివాస	: దాస్ కా ధమ్కీ
వెంకటేశ్వర	: రంగమార్తాండ
జెమిని సినిమా స్క్రీన్ 1	: రంగమార్తాండ/ బలగం
జెమిని సినిమా స్క్రీన్ 2	: దాస్ కా ధమ్కీ /కబ్జా

లక్సెట్టిపేట

మహానంద	: బలగం

జన్నారం

రాఘవేంద్ర	: బలగం

చెన్నూర్

శ్రీశ్రీనివాస	: బలగం

బెల్లంపల్లి

రామకృష్ణ	: దాస్ కా ధమ్కీ
బాలాజీ	: బలగం

సీసీసీ

దేవి	: దాస్ కా ధమ్కీ
తిరుమల	: దాస్ కా ధమ్కీ

- మంచిర్యాలటౌన్



జైపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



ఆస్నాదలో ఉత్సవాల్లో సర్పంచ్ కుటుంబ సభ్యులు



శివ్వారంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



తాండూర్: పూజలు చేస్తున్న నిర్వాహకులు, చిన్నారులు

ఊరూరా.. ఉగాది



భీమారంలో అరక కట్టి పనులకు శ్రీకారం



చెన్నూర్ శివాలయంలో...



మందమర్రిరూరల్: పచ్చడి పంపిణీ చేస్తూ...



దండేపల్లి: హనుమాన్ ఆలయం వద్ద ఉగాది పచ్చడి పంపిణీలో స్వాములు



వేమనపల్లి: శివాలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకుడు వెంకన్న శర్మ



దండేపల్లి: చింతపల్లి హనుమాన్ ఆలయంలో..



ఒత్కులపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



బెల్లంపల్లి: కాంగ్రెస్ కార్యాలయంలో...



లక్సెట్టిపేటలో పంచాంగం చదువుతున్న పురోహితులు ప్రణవ్ శర్మ

సాక్షి నెట్‌వర్క్: శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నదాతలు అరక కట్టి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఆలయాల్లో, ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి షడ్రుచుల పచ్చడిని తాగారు. తీపి వంటకాలు చేసుకుని భుజించారు. పురోహితులు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది శుభ-అశుభ ఫలితాలను, వర్షాల పరిస్థితి, పంటల దిగుబడి, రాశిఫలితాలను తెలియజేశారు. పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. విశ్వబ్రాహ్మణులు తమ ఇళ్లలో మహమ్మాయి అమ్మవారికి పూజలు నిర్వహించారు. దేవుళ్లుగా భావించే పనిముట్లను మంటపంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

- దండేపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో బాలికలకు ఇంటిని మరిపించేలా.. పాఠశాలలోనే షడ్రుచుల ఉగాది పచ్చడితో పాటు, బూరెలను విద్యార్థుల కోసం తయారు చేయించి పెట్టారు.

- మందమర్రిలో ఉగాది వేడుకల్లో జెడ్పీ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, నేతకానీ మహర్ సంఘం అధ్యక్షుడు దుర్గం రాజేష్, మార్కెట్ వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్‌కుమార్, వైఎస్సార్‌టీపీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీమొద్దీన్, డాక్టర్ రాజారమేష్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

- శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7గనిపై అమ్మవారి ఆలయంలో గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, ఇంజనీర్ తోట రమేశ్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ మెండె వెంకటి పాల్గొన్నారు.







జిల్లా కేంద్రంలో ఉగాది సంబురం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరంను పురస్కరించుకుని ఇళ్ల గుమ్మానికి మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. మామిడి ముక్కలు, బెల్లం, ఉప్పుకారం, చింతపండు, వేపపూలు షడ్రుచులతో చేసిన పచ్చడిని ఇంటిల్లిపాది ఆరగించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకుల నుంచి పంచాంగ ఫలాలు తెలుసుకున్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని పలు ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. విశ్వనాథస్వామి ఆలయం, సాయిబాబా మందిరం, గౌతమినగర్ కోదండ రామాలయం, హైటెక్‌సిటీ హరిహర క్షేత్రానికి తరలివచ్చి దైవదర్శనం చేసుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. పాత మంచిర్యాల సాయిబాబా ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబసభ్యులు దైవదర్శనం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పాల్గొన్నారు. మంచిర్యాల కేజీబీవీలో ఉగాది సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులకు పచ్చడి, బూరెలు పంపిణీ చేశారు. రోజంతా ఉపాధ్యాయులు, విద్యార్థులు సందడిగా గడిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘ భవనానికి భూమిపూజ

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన భవన నిర్మాణానికి బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంఘ భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన అనంతరం అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, సంఘం రాష్ట్ర కార్యదర్శి సిలోజు మురళి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, ప్రభాకర్, బ్రహ్మయ్య, జనార్దన్, సిలోజు శ్రీనివాస్, నర్సింహాచారి, శంకరయ్య, మాజీ ఎంపీపీ కళావతి, అమృత, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జనహిత సేవలు ప్రశంసనీయం

బెల్లంపల్లి: జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రశంసించారు. జనహిత సేవా సమితి అన్నదాన కార్యక్రమం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా కాంటా చౌరస్తాలో బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై పురప్రజలకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువకులు సామూహికంగా ఏర్పడి ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్, నిర్వాహకులు గిరిప్రసాద్, విజయ్‌కుమార్, బాలాజీ, సాంబారి నర్సయ్య, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పూలే సంస్కృతిని ఆచరించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'పూలే ఉగాది సంబురాలు కార్యక్రమం' నిర్వహించారు. బహుజన నాయకులు మాట్లాడుతూ పూలే సంస్కృతిని అందరూ ఆచరించాలని, బహుజన వర్గాల శ్రమతోనే ప్రపంచం నడుస్తుందన్నారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచికగా ఉగాది పండగను స్వీకరించి, బహుజన సంస్కృతితో పండగను జరుపుకోవాలన్నారు. ఆధిపత్య వర్గాల సంస్కృతిని కూలదోసి పూలే, అంబేద్కర్ చూపిన బాటలో శ్రామికవర్గ సంస్కృతిని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, కులవివక్ష వ్యతిరేఖ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుట్ల మల్లయ్య, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనకరాజు, ప్రజాస్వామిక ఉపాధ్యాయ సంఘం నాయకులు మోతే జయకృష్ణ, ఆసంపెల్లి రమేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషయ్య, బహుజన వంచిత్ అగాడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

ఘనంగా భూ సుపోషణ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని కర్ణమామిడి, నర్సింగాపూర్ గ్రామాల్లో బుధవారం గ్రామభారతి, హాజీపూర్ రైతు ఉత్పత్తి కేంద్రం ఆధ్వర్యంలో భూ సుపోషణ్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజ చేసిన అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మట్టిని మొక్కలకు, చెట్ల చుట్టూ పోసి సంరక్షణతో పాటు సేంద్రీయ వ్యవసాయం చేస్తామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. సేంద్రీయ వ్యవసాయంతో భూమికి రక్షణ ఇవ్వడంతో పాటు రసాయన రహిత సేద్యంతో రాబోయే రోజుల్లో సేంద్రీయ వ్యవసాయం చేపడితేనే భూమాతను కాపాడుకున్న వారమవుతామని ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రామ భారతి సంపర్క్ ప్రముఖ్ కందికంటి శ్రీనివాసరావు రైతులకు సూచించారు. రైతులను సేంద్రీయ సాగు వైపు దృష్టి సారించేలా చైతన్యం చేసేలా రానున్న రోజుల్లో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామభారతి జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, ప్రకృతి సేంద్రీయ రైతు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, స్థానికులు ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, బొలిశెట్టి తిరుపతి, రాజేశ్, లింగయ్య, భూమయ్య, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సేంద్రీయ సాగు రైతులు పాల్గొన్నారు.



నర్సింగాపూర్‌లో రైతుల పూజలు

'ప్రమోషన్లు ఇచ్చాకే బదిలీ చేయాలి'

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గనిని త్వరలో మూసివేయనున్న నేపథ్యంలో ఈ గనిలో ఆయా డిసిగ్నేషన్‌లలో యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే వేరే గనులకు బదిలీ చేయాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. గనిలో బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు చేయటం ద్వారా కార్మికులు నష్టపోతారన్నారు. నాయకులు లింగయ్య, వినయ్, రమేష్, గట్టయ్య పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

పోడియం కాంప్లెక్స్ భవనానికి భూమిపూజ

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానం మినీస్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న పోడియం కాంప్లెక్స్ భవనానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ప్రజల సౌకర్యం కోసం సీఎస్‌ఆర్ నిధులు రూ.30లక్షలతో పోడియం కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, యువజన నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణాధ్యక్షులు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు చాత రాజు రాజన్న, సురేష్‌నాయక్, శ్రీకాంత్, నాయకులు సజ్జు, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

తాండూర్: తీన్మార్ మల్లన్న, సుదర్శన్‌గౌడ్, విఠల్ అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం తాండూర్ మండలం రేచినీ గ్రామంలో యువకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, అన్యాయాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందు వల్లనే తీన్మార్ మల్లన్న, సుదర్శన్ గౌడ్, విఠల్‌లను చట్ట విరుద్ధంగా పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువకులు ఆదే శ్రీనివాస్, బామనపల్లి ఆనంద్, రాజ్‌కుమార్, మనోజ్, ప్రశాంత్, రవితేజ, సోమయ్య, స్వామి, భాస్కర్‌గౌడ్, శంకర్, ప్రవీణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

జైపూర్/భీమారం: రంజాన్ మాసాన్ని, నెలాఖరుల్లో జరుపుకునే శ్రీరామనవమి పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై రామకృష్ణ, భీమారం ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారంలో, భీమారం పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హిందు, ముస్లిం మత పెద్దలకు, ప్రజాప్రతినిధులకు పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

మంచిర్యాలఅర్బన్: మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు చెల్లించటం లేదని యూఎస్‌పీసీ నాయకులు ఆరోపించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24న ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, పెండింగ్ బిల్లుల మంజూరు కోరుతూ చేపట్టే నిరసన ప్రదర్శనల నేపథ్యంలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేటయించిన బడ్జెట్ ఉన్నప్పటికీ మూడు నెలలుగా వేతనాలు,సెలవు జీతాలు, జీపీఎఫ్ క్లెయిమ్‌లు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలతో పాటు పలు బిల్లులు మంజూరు కావటం లేదన్నారు. ఈ నెల 24న తలపెట్టిన నిరసన ప్రదర్శనకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)నాయకులు రాజావేణు, రమేష్, జయకృష్ణ, జాకీర్‌హుస్సేన్, అప్పారావు, బారిక్‌రావు,సురేష్, వహీద్ పాల్గొన్నారు.